

పర్యావరణ పరిరక్షకులుగా..

విద్యార్థులను పర్యావరణ పరిరక్షకులుగా తీర్చిదిద్దాలని ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. - 8లో



తాళం వేసిన ఇళ్లే టార్గెట్

తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేసి చోరీకు పాల్పడుతున్న యువకుడు, బాలికను నకిరేకల్ పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : **590** అడుగులు

ప్రస్తుత నీటి మట్టం	:	**589.50** అడుగులు
ఇన్‌ఫ్లో	:	**1,86,258** క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	**1,86,258** క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	**25,428** క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	**7,086** క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	**3,788** క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	**1,800** క్యూసెక్కులు
వరద కాల్వకు	:	**300** క్యూసెక్కులు



18 గేట్లనుంచి పరవళ్లు

నాగార్జునసాగర్ : సాగర్ జలాశయానికి మంగళవారం వరద ఉధృతి భారీగా పెరగడంతో 18 క్రస్ట్ గేట్ల నుంచి దిగువకు పరుగులు పెడుతున్న కృష్ణమ్మ



అలుగు దాటిన వరద

నిడమనూరు : భారీ వర్షాలకు వరద చేరడంతో నిండుకుండలా మారి అలుగు పోస్తున్న నిడమనూరు చెరువు

న్యూస్‌రీల్

క్రీడల నిర్వహణ అభినందనీయం

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడలు నిర్వహించడం అభినందనీయమని ప్రధాన జిల్లా జడ్జి ఎం.నాగరాజు అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం నల్లగొండ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. నిరంతరం బిజీగా ఉండే న్యాయవాదులకు క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని అన్నారు. కార్యక్రమంలో ఫ్యామిలీ కోర్ట్ న్యాయమూర్తి డి.దుర్గాప్రసాద్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కట్టా అనంత రెడ్డి, కార్యదర్శి మంద నగేష్, క్రీడల కార్యదర్శి జిఎస్ఎన్.ప్రసాద్, గుండ్ల అంజిరెడ్డి, జనిగల రాములు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇంటర్వ్యూలు

రామగిరి(నల్లగొండ) : నాగార్జునసాగర్ మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల డిగ్రీ కళాశాల (పురుషులు)లో తెలుగు గెస్ట్ లెక్చరర్ పోస్టుకు బుధవారం ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి.మాధవిలత మంగళశారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీలో 55 శాతం ఉత్తీర్ణత కలిగి ఉండి, డిగ్రీ విద్యార్థులకు బోధించడంలో అనుభవంతోపాటు యూసీజీ నెట్, సెట్, పీహెచ్‌డీ అర్హత ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 13వ తేదీన కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు సర్టిఫికెట్లతో హాజరు కావాలని.. పూర్తి వివరాలకు 9492540363 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పానగల్ అర్బన్ హెల్త్ సెంటర్ తనిఖీ



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్

నల్లగొండ టౌన్ : పానగల్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సేవలపై సిబ్బందిని ఆరాతీశారు. సెంటర్‌కు వచ్చే రోగులకు సరైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం సెంటర్‌లో రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్లు, సిబ్బంది ఉన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



వంటగదిని పరిశీలిస్తున్న శశికళ

పెద్దఅడిశర్లపల్లి : ప్రభుత్వ వసతి గృహాల్లో ఉండే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ శశికళ అన్నారు. మంగళవారం పెద్దఅడిశర్లపల్లి మండలంలోని దుగ్యాల మోడల్ స్కూల్ వసతి గృహాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్‌లోని మౌలిక వసతులు, మెనూ వివరాలపై ఆరా తీశారు. వంటగది, స్టోర్ రూమ్‌లోని సరుకులను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని, వంటగదిని పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆమె వెంట ఎంఈఓ వెంకటయ్య ఉన్నారు.

‘ఈపాస్’ ద్వారానే ఎరువులు అమ్మాలి



ఎరువులను పరిశీలిస్తున్న శ్రవణ్‌కుమార్

చిట్యాల : రైతులకు అందజేస్తున్న ఎరువుల వివరాలను రిజిస్టర్, ఈపాస్ మిషన్‌లో నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పి.శ్రావణ్‌కుమార్ సూచించారు. రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా చిట్యాల మండలం గుండ్రాంపల్లి రైతు వేదికలో మంగళవారం ప్రకృతి వ్యవసాయం అనే అంశంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. అనంతరం పీఏసీఎస్‌లో ఎరువుల అమ్మకాల తీరును పరిశీలించారు. రైతులు అవసరం మేరకే ఎరువులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ ఎసిరెడ్డి దయాకర్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఆవుల నాగరాజు, ఏఈఓ వీణకుమారి పాల్గొన్నారు.

కార్పొరేషన్ పదవుల పందేరం

- రాష్ట్ర పార్టీకి జాబితాలను పంపించిన జిల్లా మంత్రులు
- నియోజకవర్గానికి ఇద్దరు ముగ్గురికి దక్కనున్న డైరెక్టర్ పదవులు
- వీరి నియామకం తర్వాతే స్థానిక ఎన్నికలు
- చైర్మన్ పదవులపై వీడని సందిగ్ధం



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : కార్పొరేషన్ డైరెక్టర్ల నియామకానికి కాంగ్రెస్ పార్టీ కసరత్తు చేస్తోంది. కార్పొరేషన్ డైరెక్టర్లను త్వరలోనే భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పార్టీ సమావేశంలో పేర్కొన్న విషయం తెలిసిందే. దీంతో ఆశావహుల్లో ఆశలు మొదలయ్యాయి. ఇప్పటికే జిల్లాలో మంత్రులు సిద్ధం చేసిన జాబితాలను రాష్ట్ర పార్టీకి పంపించారు. అందులో కొందరికి త్వరలోనే డైరెక్టర్ పదవులు దక్కనున్నాయి.

ప్రతి నియోజకవర్గంలో ఇద్దరు ముగ్గురికి అవకాశం

రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కార్పొరేషన్లు వందవరకు ఉండగా, ఒక్కో దాంట్లో నాలుగైదు డైరెక్టర్ పదవులు ఉన్నాయి. వాటిని భర్తీ చేసేందుకు జాబితాలు ఇవ్వాలని గతంలోనే మంత్రులకు రాష్ట్ర పార్టీ సూచించింది. అందుకు అనుగుణంగా ఆయా పదవుల కోసం ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాల నుంచి పది మంది చొప్పున పేర్లను సిద్ధం చేసి అధిష్టానానికి పంపించారు. అందులో నియోజకవర్గానికి ఇద్దరు ముగ్గురికి డైరెక్టర్లుగా అవకాశం లభించనుంది.

స్థానిక ఎన్నికలకు ముందే భర్తీ..

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటిపోయింది. పార్టీలో పనిచేసే వారికే పదవులు అప్పగిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు పీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి కూడా పలు సందర్భాల్లో ప్రకటించారు. అందులో భాగంగా ప్రస్తుతం కార్పొరేషన్ డైరెక్టర్ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించే ఆలోచనల్లో ప్రభుత్వం ఉంది. అంతకంటే ముందుగానే కార్పొరేషన్ల డైరెక్టర్ పదవులను భర్తీ చేయడం ద్వారా కాంగ్రెస్ పార్టీలో మరింత ఊపు వచ్చే అవకాశం ఉంది. తద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో కేడర్ బాగా పని చేస్తుందనే అంచనాల్లో ఉంది. కార్యకర్తలు కూడా కష్టపడి పని చేస్తారనే ఉద్దేశంతో పార్టీ అధిష్టానం ఉన్నట్లుగా సమాచారం. అందుకే ముందుగా డైరెక్టర్ పోస్టులను భర్తీ చేసి ఆ తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు పోవాలనే కాంగ్రెస్ పార్టీ ఉన్నట్లు పార్టీ నేతల్లో చర్చ సాగుతోంది.

చైర్మన్ పదవులు ఎప్పుడు...?

ప్రస్తుతం కార్పొరేషన్ల డైరెక్టర్ పదవులను భర్తీ చేయనున్న నేపథ్యంలో ఆయా కార్పొరేషన్ల చైర్మన్ల పదవులను ఎప్పుడు భర్తీ చేస్తారనే చర్చ సాగుతోంది. ఇప్పటికే ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి ఆశావహులు కార్పొరేషన్ల చైర్మన్ పదవుల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో ముందుగా డైరెక్టర్ పదవులను భర్తీ చేస్తామని చెప్పడంతో చైర్మన్ పదవులను ఎప్పుడు భర్తీ చేస్తామన్నది ప్రకటించకపోవడంతో సందిగ్ధత నెలకొంది.

సమ్మెలోకి కేటరింగ్ కాంట్రాక్టర్లు

- నేటి నుంచి గురుకులాలు, కేజీబీవీల్లో వంటలు బంద్
- జీఓ 17కు నిరసనగా ఆందోళన బాట



నల్లగొండ : ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన జీఓ 17కు వ్యతిరేకంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ గురుకులాలు, కస్తూరిబా గాంధీ విద్యాలయాల్లో భోజనం అందించే కేటరింగ్ కాంట్రాక్టర్లు సమ్మెలోకి వెళ్తున్నారు. ఈ ఈ నెల 14వ తేదీనుంచి సమ్మెలోకి వెళ్తున్నట్లు ఇప్పటికే వారు కలెక్టర్‌కు నోటీసు అందజేశారు. వారితోపాటు కూరగాయలు, పండ్లు, మటన్, చికెన్ సరఫరా చేసే కాంట్రాక్టర్లు కూడా సమ్మె బాట పడుతున్నారు. నేటి నుంచి గురుకులాల్లో వంట సేవలు ఆగిపోనున్నాయి. దీంతో విద్యార్థులు ఎవరు వంట చేస్తారనే దానిపై సందిగ్ధం నెలకొంది.

బడా కాంట్రాక్టర్లకు అనుకూలంగా జీఓ 17

ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వం కేటరింగ్ కాంట్రాక్టర్ల ఎంపిక విషయంలో జీఓ నంబర్ 17 తెచ్చింది. ఈ జీవో ప్రకారం ఒక కాంట్రాక్టర్, ఒక స్కూల్‌కు సంవత్సర కాలంలో రూ.20 లక్షలు సరుకులు సరఫరా చేస్తే రూ.4 లక్షలు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ఈ జీవో వల్ల చిన్న కాంట్రాక్టర్లు టెండర్లలో పాల్గొనే పరిస్థితి లేదని.. బడా కాంట్రాక్టర్లకు అనుకూలంగా కొత్త జీఓ ఉందనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే నాలుగు నెలలుగా ఎలాంటి బిల్లులు రాక ఇబ్బందులు పడుతుంటే.. ప్రస్తుతం కొత్త టెండర్ విధానం తేవడంపై విమర్శలు వస్తున్నాయి. ఈ టెండర్‌లో పాల్గొనే ఆర్థిక స్థోమత లేదని సడలింపులు ఇవ్వాలని ఇప్పటికే పలువురు చిన్న కాంట్రాక్టర్లు కలెక్టర్‌కు విన్నవించారు. పాత టెండర్ విధానం కొనసాగించాలని కోరారు. కానీ ప్రభుత్వం నుంచి ఎటువంటి నిర్ణయం వెలువడలేదు.

వంట ఎలా..!

గురుకుల, కేజీబీవీల్లో వంటలను మహిళా సంఘాలకు అప్పగిస్తారని చర్చ సాగుతోంది. నెలకు సరిపడా కిరాణ సామాను ఇప్పటికే హాస్టళ్లకు చేరింది. కూరగాయలు 2, 3 రోజులకోసారి సరఫరా చేస్తారు. మటన్, చికెన్ వారంలో 2 పర్యాయాలు అందిస్తారు. కాంట్రాక్టర్లు సమ్మెలోకి వెళ్తే వీటి సరఫరా ఆగిపోయే అవకాశం ఉంది. వంట సిబ్బంది సమ్మె బాట పడితే పిల్లలకు భోజనానికి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది.

జిల్లా మంత్రులు దద్దమ్మలు



పానగల్ రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, నాయకులు

- వందల టీఎంసీల నీరు సముద్రం పాలవుతున్నా.. ఏఎమ్మార్పీ పరిధిలో నీరిచ్చే సోయి లేదు
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : వందల టీఎంసీల నీరు సముద్రం పాలవుతున్నా.. ఏఎమ్మార్పీ ఆయకట్టు చివరి భూములకు సాగునీరు అందించే సోయిలేని జిల్లా మంత్రులు దద్దమ్మలని మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం నల్లగొండలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని ఇద్దరు మంత్రులకు ఏపీకి నీరు వదిలేంత ఆతృత జిల్లాలో రైతులకు ఇవ్వడంలో లేదన్నారు. కేసీఆర్ హయాంలో ఏఎమ్మార్పీ కింద కనగల్, నల్లగొండ, తిప్పర్తి, నకిరేకల్, సాగర్ పరిధిలో చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిచామన్నారు. ఒక్క నల్లగొండ నియోజకవర్గంలోనే 70 వేల ఎకరాలకు నీరందించిన ఘనత మా ప్రభుత్వానిదన్నారు. సాగునీటి కోసం రైతులు రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేస్తున్నా మంత్రి కోమటిరెడ్డికి పట్టింపు లేదని మండిపడ్డారు. కృష్ణానది జలకళ సంతరించుకున్నా.. జిల్లాలోని చెరువులు ఎండిపోయినట్లు కనిపిస్తున్నాయని, గత సంవత్సరం కూడా పంటలు ఎండబెట్టిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. మోటార్లు మరమ్మతుకు గురైతే సమీక్షించే బాధ్యత జిల్లా మంత్రి కోమటిరెడ్డికి లేదా అని ప్రశ్నించారు. నల్లగొండ నడిబొడ్డున ఆర్అండ్‌బీ అతిథి గృహాన్ని మంత్రి సొంత క్యాంపు కార్యాలయంగా మార్చుకోవడం సరికాదన్నారు. నిజాం కాలం నాటి అతిథి గృహాన్ని మార్చడం మంచి పద్ధతి కాదన్నారు. దానికి నిధులు మంజూరు చేసింది కేసీఆర్ ప్రభుత్వమని గుర్తు చేశారు. అంతకు ముందు పానగల్ ఉదయసముద్రాన్ని నాయకులతో పరిశీలించారు. సమావేశంలో ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, నాయకులు కటికం సత్తయ్య గౌడ్, నిరంజన్ వలి, సింగం రామ్మోహన్, చీర పంకజ్‌యాదవ్, మాలె శరణ్యారెడ్డి, అభిమన్యు శ్రీనివాస్, బక్క పిచ్చయ్య, బోనగిరి దేవేందర్, రవీందర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, ఐతగాని యాదయ్య, దేప వెంకట్‌రెడ్డి, వంగాల సహదేవరెడ్డి, తండు సైదులుగౌడ్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి
- ఎస్పీతో కలిసి మూసీ ప్రాజెక్టు సందర్శన



మూసీ రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

కేతేపల్లి : మూసీ ప్రాజెక్టు గేట్ల నిర్వహణలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. మంగళవారం ఆమె ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలసి మూసీ ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు వద్ద ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో, నీటిమట్టం, కుడి, ఎడమ కాల్వల ఆయకట్టు పరిధిలో వివరాలు, ప్రాజెక్టు వద్ద నెలకొన్న సమస్యలు నీటిపారుదల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గేట్లకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ క్రస్ట్‌గేట్లు ఎత్తాలని సూచించారు. అనంతరం వారు మూసీ ప్రాజెక్టు దిగువన కేతేపల్లి మండలంలోని భీమారం గ్రామం వద్ద మూసీ నదిపై నిర్మించిన లోలెవల్ కాజ్‌వేను పరిశీలించారు. మూసీ ప్రాజెక్టు నుంచి 20వేల క్యూసెక్కులకు పైగా వరదనీటిని వదిలినప్పుడు మాత్రమే లోలెవల్ కాజ్‌వే వద్ద రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని అధికారులు కలెక్టర్‌కు చెప్పారు. కలెక్టర్ వెంట నల్లగొండ ఆర్డీఓ అశోక్‌రెడ్డి, సూర్యాపేట డివిజన్ ఐబీ ఈఈ ఎస్.వెంకటరమణ, మూసీ డీఈలు చంద్రశేఖర్‌రెడ్డి, వాణి, జేఈ కీర్తి, ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు, తహసీల్దార్ రమాదేవి, ఆర్ఐ వెంకన్న తదితరులు ఉన్నారు.

ప్రజలకు ఇబ్బంది కలగొద్దు

నల్లగొండ : రానున్న 72 గంటల్లో అత్యధిక వర్షపాతం కురిసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో హైదరాబాద్ నుంచి సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న అనంతరం జిల్లా అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి అక్కడి నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. సమావేశంలో ఎస్పీ శరత్ చంద్ర పవార్, అదనపు కలెక్టర్లు జె. శ్రీనివాస్, నారాయణ్ అమిత్, దేవరకొండ ఏసీపీ మౌనిక తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నేడు ఉపాధ్యాయులకు శిక్షణ

నల్లగొండ : డిజిటల్ అక్షరాస్యత, కృత్రిమ మేధ అంశాలపై బుధవారం నల్లగొండలోని డైట్ కళాశాలలో ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఈఓ భిక్షపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రతి ప్రైమరీ స్కూల్ కాంప్లెక్స్ నుంచి ఇద్దరు చొప్పున 200 మంది గణిత ఉపాధ్యాయులకు ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణకు ఉపాధ్యాయులు సకాలంలో హాజరు కావాలని ఆయన సూచించారు.

మహిళా సిబ్బంది క్షేత్రస్థాయికి వెళ్లాలి


- ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ : మహిళ పోలీస్ సిబ్బంది ప్రజల్లోకి వెళ్లి క్షేత్రస్థాయిలో పనిచేయాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం మహిళా పోలీసు సిబ్బంది బ్లూ కోల్ట్స్ విధులను ఆయన జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. మహిళా పోలీసులు ప్రజా సమస్యలు తెలుసుకుంటూ బాధితులకు భరోసా కల్పించాలని సూచించారు. మహిళా సిబ్బంది పోలీస్‌స్టేషన్‌లో విధులకే పరిమితం కావొద్దన్నారు. వారిలో ఆత్మవిశ్వాసం పెంచేందుకు సెల్ఫ్ డిఫెన్స్‌పై శిక్షణలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో మహిళా పోలీస్ సిబ్బంది బ్లూ కోల్ట్స్ విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ మౌనిక, అదనపు ఎస్పీ రమేష్, డీఎస్పీ శివరాంరెడ్డి, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్‌బీ సీఐ రాము, టూటౌన్ సీఐ రాఘవరావు, ట్రాఫిక్ సీఐ మహాలక్ష్మయ్య, ఆర్ఐలు సూరప్పనాయుడు, సంతోష్, శ్రీను మహిళా ఎస్ఐలు శ్రావణి, విజయబాయి పాల్గొన్నారు.



జెండా ఊపి బ్లూ కోల్ట్స్ విధులను ప్రారంభిస్తున్న ఎస్పీ శరత్ చంద్రపవార్, చిత్రంలో ఏఎస్పీ మౌనిక

పత్తికి అదునైన వాన..!



పెద్దవూర వద్ద ఏపుగా పెరిగిన పత్తి చేను

- జిల్లాలో 5,57,641 ఎకరాల్లో సాగు
- పూత, పిందె దశలో పత్తి చేలు
- మంచి దిగుబడి వస్తుందని రైతుల ఆశాభావం

నల్లగొండ అగ్రికల్చర్ : ఈ వానాకాలం సీజన్‌లో మెట్టపంటలకు అనుకూలంగా మంచి అదునైన వర్షాలు కురుస్తున్నాయి. జూన్‌లో కొంత ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడినప్పటికి జూలై, ఆగస్టు నెలల్లో మంచి వర్షాలే కురిసాయి. ఈ వర్షాలు పత్తి పంటకు అనుకూలంగా మారాయి. జిల్లా వ్యాప్తంగా 5,57,641 ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేశారు. మంచి అనుకూలమైన వర్షాలు కురవడంతో పత్తి చేలలో గుంటకలు తోలుకుని కలుపు తీసుకున్నారు. ఇప్పటికే మూడుసార్లు ఎరువులు పెట్టుకోవడంతో చేలు మంచి ఏపుగా పెరిగి పూత, పిందె దశలో కనిపిస్తున్నాయి.వారం రోజుల్లో కాయదశకు చేరుకుంటాయి. దసరా పండుగ నాటికి పత్తి తెంపే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం చేలు ఉన్న పరిస్థితిని బట్టి చూస్తే ఈ సీజన్‌లో పత్తి మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అధిక వర్షపాతం నమోదు

జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు అధిక వర్షపాతం నమోదైంది. మిర్యాలగూడం మండలంలో మాత్రం లోటు వర్షం కురిసింది. ఇప్పటి వరకు సగటున జిల్లాలో 246.1 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా.. 309.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మర్రిగూడ, పీఏపల్లి, కొండమల్లేపల్లి, గుండ్లపల్లి, చందంపేట మండలాల్లో అత్యధిక వర్షం కురవగా చిట్యాల, నార్కట్‌పల్లి, కట్టంగూర్, శాలిగౌరారం, నకిరేకల్, చింతపల్లి, గుర్రంపోడు, అడవిదేవులపల్లి, టి.సాగర్, పెద్దవూరలో అధిక వర్షం కురిసింది. మిగతా మండలాల్లో సాధారణ వర్షం కురిసింది.

జిల్లా అంతటా వర్షం

నల్లగొండ అగ్రికల్చర్ : ఉపరితల ద్రోణి కారణంగా సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు జిల్లా వ్యాప్తంగా జోరువాన కురిసింది. సగటున్న 40.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా శాలిగౌరారం మండలంలో 79.4 మి.మీ, గుడిపల్లిలో 77.3 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. చిట్యాలలో 62.3మి.మీ., నార్కట్‌పల్లి 58.7, కట్టంగూర్ 51.2, నకిరేకల్ 59.9, కేతేపల్లి 41.0, తిప్పర్తి 21.7, నల్లగొండ 64.7, కనగల్ 55.5, మునుగోడు 49.4, చండూరు 49.1. మర్రిగూడ 26.4, చింతపల్లి 17.9, నాంపల్లి 46.4, గుర్రంపోడు 60.2, అనుముల హాలియా 37.5, నిడమనూరు 29.6, త్రిపురారం 25.2, మాడ్గులపల్లి 68.0, వేములపల్లి 20.4, మిర్యాలగూడ 6.8, దామరచర్ల 8.6, అడవిదేవులపల్లి 18.6, తిరుమలగిరిసాగర్ 29.5, పెద్దవూర 31.8, పీఏపల్లి 68.1, నేరడుగొమ్ము 20.3, కె.మల్లేపల్లి 66.7, దేవరకొండ 17.2, గుండ్లపల్లి 11.3, చందంపేట 12.9, గట్టుప్పల్‌లో 36.0 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

క్లుప్తంగా

విద్యార్థులను పర్యావరణ పరిరక్షకులుగా తీర్చిదిద్దాలి

- ఎంజీయూ వీసీ అల్తాఫ్ హుస్సేన్


టీడీ స్వచ్ఛంద సంస్థతో ఒప్పందం చేసుకుంటున్న వీసీ అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ టూటౌన్: మహాత్మాగాంధీ యూనివర్సిటీ విద్యార్థులను పర్యావరణ పరిరక్షకులుగా తీర్చిదిద్దాలని వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. మంగళవారం ఎంజీయూలో పర్యావరణ పరిరక్షణ, ఘన వ్యర్థాలు, పర్యావరణ పునరుద్ధరణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంతేకాకుండా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించేలా పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్‌కు చెందిన టీడీ స్వచ్ఛంద సంస్థతో ఎంజీయూ ఒప్పందం చేసుకుంది. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. యువత పర్యావరణ పరిరక్షణలో చురుకైన పాత్ర పోషించాలన్నారు. యూనివర్సిటీలోని బయోటెక్నాలజీ సోషల్ వర్క్, బయో కెమిస్ట్రీ కామర్స్, ఎకనామిక్స్ విద్యార్థులు తమ పరిశోధనలో పర్యావరణ అవసరాలను ఎంచుకోవాలన్నారు. అనంతరం టీడీ సంస్థ డైరెక్టర్ ఉత్సవ్ ప్రధాన్ తమ సంస్థ ద్వారా విద్యార్థులతో చేపట్టనున్న కార్యక్రమాల ప్రణాళికను వివరించారు. నల్లగొండ జిల్లా హాలియా మండలం కొత్తపల్లిలో తమ సంస్థ చేపట్టిన పరిశోధన వివరాలతో పాటు ఉమ్మడి జిల్లా పరిధిలో ప్లాస్టిక్ రహిత పట్టణాల కోసం కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంజీయూ ఇండస్ట్రీ అకడమిక్ సెల్ డైరెక్టర్ సురేష్‌రెడ్డి, మిర్యాల రమేష్, ప్రిన్సిపాల్ ప్రేమ్‌సాగర్, అధ్యాపకులు తిరుమల, రామచందర్‌గౌడ్, శివరాం, సమ్రిన్ కాజ్మి, మురళి పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం

కోదాదరూరల్: టీవీఎస్ ఎక్సెల్‌పై వెళ్తున్న వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతిచెందాడు. ఈ ఘటన కోదాడ పట్టణ పరిధిలో మంగళవారం జరిగింది. చిలుకూరు మండలం సీత్లాతండాకు చెందిన ఇస్లావత్ హీరు (45) పని నిమిత్తం మంగళవారం టీవీఎస్ ఎక్సెల్‌పై కోదాడకు వస్తున్నాడు. హైదరాబాద్–విజయవాడ హైవేపై కోదాడ పట్టణంలోని హుజూర్‌నగర్ రోడ్‌లో ఫ్లైఓవర్ సర్వీస్ రోడ్‌లో కట్టకమ్ముగూడెం క్రాసింగ్ వద్ద రోడ్డు దాటేందుకు వెళ్లాడు. అక్కడ క్రాసింగ్‌ను మూసివేయడంతో అదే మార్గంలో రాంగ్‌రూట్‌లో ఫ్లైఓవర్ వైపు వస్తుండగా విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య శ్రీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బైక్ చక్రంలో చీరకొంగు చిక్కుకొని..

- కిందపడిన తల్లి, కుమారుడు
- చికిత్స పొందుతూ తల్లి మృతి

చౌటుప్పల్: బైక్ చక్రంలో చీరకొంగు చిక్కుకొని తల్లి, కుమారుడు రోడ్డుపై పడిపోయి తీవ్రంగా గాయపడ్డారు. వారిని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ తల్లి మృతిచెందింది. మంగళవారం చౌటుప్పల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామానికి చెందిన బోయ సాయమ్మ(70), ఆమె కుమారుడు భిక్షం ఆదివారం చిన్నకొండూర్‌లో బంధువుల అంత్యక్రియల్లో పాల్గొనేందుకు బైక్‌పై వెళ్లారు. అంత్యక్రియలు ముగిశాక ఇద్దరు కలిసి స్వగ్రామానికి బయల్దేరారు. చౌటుప్పల్ శివారులోని శ్రీని ఫార్మా కంపెనీ సమీపంలోకి రాగానే సాయమ్మ చీరకొంగు బైక్ వెనుక చక్రంలో చిక్కుకుంది. దీంతో బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోవడంతో సాయమ్మ, భిక్షం తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని చౌటుప్పల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు వారిని హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ సాయమ్మ సోమవారం రాత్రి మృతిచెందింది. భిక్షం చికిత్స పొందుతున్నాడు. మృతురాలి కోడలు బోయ అరుణ మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

పొంగిన వాగులు


అర్వపల్లి: పర్సాయపల్లిలో పొలాలు, చెల్కలను ముంచెత్తిన వర్షపు నీరు


అర్వపల్లి: కేజీబీవీ నుంచి ట్రాక్టర్‌లో విద్యార్థులను తరలిస్తున్న దృశ్యం


భూదాన్‌పోచంపల్లి: జూలూరు, రుద్రవెల్లి మధ్యన ప్రవహిస్తున్న మూసీ


నాగారం: వరద తాకిడికి నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు


తిరుమలగిరి: గుండెపురి చెరువు అలుగులో చేపలు పడుతున్న గ్రామస్తులు


నాగారం: వర్ధమానుకోటలో చెక్‌డ్యాం వద్ద అలుగుపోస్తున్న బిక్కేరు వాగు

వైద్యం వికటించిందని బాధితుల ఆందోళన

- నడుము నొప్పితో ప్రైవేట్ ఆస్పత్రికి వచ్చిన గర్భిణి
- రిపోర్టులు వాట్సాప్‌లో చూసి సిబ్బంది ద్వారా మందులు ఇచ్చిన వైద్యురాలు
- ఇంటికి వెళ్లిన తర్వాత ప్రసవించిన గర్భిణి
- పురిట్లోనే మగ శిశువు మృతి

భువనగిరిటౌన్: నడుము నొప్పితో ప్రైవేట్ ఆస్పత్రికి వచ్చి చికిత్స పొందిన గర్భిణి ఇంటికి వెళ్లిన కొద్దిసేపటికే మగ శిశువుకు జన్మనిచ్చింది. కానీ పురిట్లోనే శిశువు మృతిచెందాడు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్ట మండలం యాదగిరిపల్లికి చెందిన బూడిద ప్రశాంత్, తేజస్విని భార్యాభర్తలు. వీరికి మొదటి కాన్పులో పాప పుట్టగా.. ప్రస్తుతం తేజస్విని ఎనిమిది నెలల గర్భిణి. నెలవారీ వైద్య పరీక్షల కోసం తేజస్విని స్థానిక పీహెచ్‌సీకి వెళ్లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. సోమవారం సాయంత్రం ఆమెకు నడుము, తుంటి నొప్పి రావడంతో పీహెచ్‌సీ తీసుకెళ్లగా బంద్ చేసి ఉందని, ఆశ వర్కర్ సాయంతో భువనగిరిలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లగా.. అక్కడ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ప్రిన్స్ మెటర్నిటీ హాస్పిటల్‌కు తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. అక్కడ కూడా ఆస్పత్రి నిర్వాహకురాలైన మహిళా వైద్యురాలు అందుబాటులో లేదని, అయితే ఆస్పత్రి సిబ్బంది తేజస్విని ఆరోగ్య పరిస్థితి, గతంలో తీసుకున్న చికిత్స, మందులను వాట్సాప్‌లో వైద్యురాలికి పంపించగా.. వైద్యురాలు వీడియో కాల్ ద్వారా సూచించిన సూదులు, మందులను తేజస్వినికి ఆస్పత్రి సిబ్బంది ఇచ్చారని, కాసేపటికే నొప్పి తగ్గడంతో తేజస్విని రాత్రి ఇంటికి తీసుకెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇంటికి వెళ్లిన కొద్దిసేపటికే అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో తేజస్విని మగ శిశువును జన్మనివ్వగా.. వారిద్దరిని భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తీసుకెళ్లగా, శిశువు మృతిచెందినట్లు వైద్యులు చెప్పారని వాపోయారు. తేజస్వినికి తీవ్ర రక్తస్రావం అవుతుండడంతో ఆస్పత్రిలో చేర్చుకుని చికిత్స అందించారని పేర్కొన్నారు.

నెలలు నిండకముందే ప్రసవించింది

ఈ ఘటనపై ఆస్పత్రి వైద్యురాలిని వివరణ కోరగా.. అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రికి వచ్చిన గర్భిణి రిపోర్టులను వాట్సాప్‌లో చూశానని, అంతేకాని తన తప్పు లేదని ఆమె పేర్కొంది. నెలలు నిండక ముందే తేజస్విని డెలివరీ అయ్యిందని, తాను చేసిన వైద్యానికి, శిశువు మరణానికి సంబంధం లేదని, కొంత మంది కావాలని దుష్ప్రచారం చేస్తున్నారని ఆమె తెలిపింది.

కుటుంబ సభ్యుల ఆందోళన


వాట్సాప్ వైద్యం వికటించే శిశువు మృతిచెందాడని ఆరోపిస్తూ ప్రిన్స్ హాస్పిటల్ ముందు తేజస్విని కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. పోలీసులు ఆస్పత్రి ఎదుట బందోబస్తు ఏర్పాటు చేశారు. పరస్పర రాజీతో వివాదం సద్దుమణిగింది. జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తేజస్వినిని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ యశోద, జిల్లా ఆస్పత్రుల పర్యవేక్షణ అధికారి వీణ పరామర్శించి విచారించారు.

డిండికి భారీగా వరద

డిండి: ఎగువన కురుస్తున్న వర్షాలకు డిండి ప్రాజెక్టులోకి వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 36 అడుగులు కాగా మంగళవారం సాయంత్రానికి 28.5 అడుగులుగా ఉంది. ఇన్‌ఫ్లో 3284 క్యూసెక్కులు వస్తుండగా.. ఎడమ కాలువ ద్వారా 120 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ ఏఈ పరమేష్ తెలిపారు.


నీటితో కళకళలాడుతున్న డిండి ప్రాజెక్టు

నాలుగు గేట్ల ద్వారా మూసీ నీటి విడుదల


మూసీ ప్రాజెక్టు నుంచి దిగువకుపోతున్న నీరు

కేతేపల్లి: హైదరాబాద్ నగరంతో పాటు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో మూసీ ప్రాజెక్టుకు భారీగా వరద ఉధృతి కొనసాగుతోంది. మంగళవారం సాయంత్రం వరకు మూసీ ప్రాజెక్టుకు 9,692 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా.. అధికారులు నాలుగు క్రస్టు గేట్లను ఐదు అడుగుల మేర పైకెత్తి 12,805 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టులో నీటిమట్టం 643.50 వద్ద నిలకడగా ఉంచి ఎగువ నుంచి వస్తున్న వరదనీటిని దిగువకు వదులుతున్నామని అధికారులు తెలిపారు. ఆయకట్టులో పంటల సాగుకు కుడి, ఎడమ ప్రధాన కాల్వలకు 231 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. మూసీ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.0 టీఎంసీల నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు ఏఈ మధు తెలిపారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి


నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న సొత్తు

- చోరీలకు పాల్పడుతున్న యువకుడు, బాలిక
- ఇద్దరిని అరెస్ట్ చేసిన నకిరేకల్ పోలీసులు
- వివరాలు వెల్లడించిన నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి

నకిరేకల్: పట్టపగలు తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేసి చోరీకు పాల్పడుతున్న యువకుడు, బాలికను నకిరేకల్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల వివరాలను మంగళవారం సాయంత్రం నకిరేకల్ పోలీస్ స్టేషన్‌లో నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి విలేకరులకు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. జూలై 3వ తేదీన నకిరేకల్ పట్టణంలోని చీమలగడ్డలో పరడ సుమలత ఇంటి తాళం పగులగొట్టి గుర్తుతెలియని వ్యక్తులు ఆభరణాలు, నగదు చోరీ చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నకిరేకల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మంగళవారం ఉదయం నకిరేకల్ మండలం చందుపట్ల గ్రామ స్టేజీ వద్ద పోలీసులు తనిఖీలు చేపట్టగా.. స్కూటీపై ఓ యువకుడు, బాలిక తిప్పర్తి నుంచి నకిరేకల్ వైపు వస్తుండగా పోలీసులు వారిని ఆపి విచారించారు. యువకుడు కేతేపల్లి మండలం ఇనుపాముల గ్రామానికి చెందిన వల్లమల్ల ప్రదీప్‌కుమార్ అలియాస్ బంటిగా పోలీసులు గుర్తించారు. బాలిక ఏపీకి చెందినదిగా గుర్తించారు. ప్రదీప్ నార్కట్‌పల్లి మండలం కేంద్రంలో తన అమ్మమ్మ వద్ద ఉంటూ బాలికతో కలిసి చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రదీప్‌కుమార్ గతంలో నకిరేకల్, శాలిగౌరారం, కట్టంగూర్, నల్లగొండ టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో 14 దొంగతనాలకు పాల్పడి ఎనిమిది నెలలు జైలు శిక్ష అనుభవించి వచ్చినట్లు డీఎస్పీ తెలిపారు. జైలు నుంచి వచ్చాక ఏపీకి చెందిన బాలికతో పరిచయం పెంచుకుని, చెడు వ్యసనాలకు బానిసై మళ్లీ చోరీలు చేస్తున్నట్లు డీఎస్పీ వివరించారు. ఈ క్రమంలోనే వారిద్దరు కలిసి నకిరేకల్, కట్టంగూర్, చిట్యాల, నార్కట్‌పల్లి, నల్లగొండలో పట్టపగలు తాళం వేసిన ఇళ్లను ఎంచుకుని చోరీలు చేస్తున్నట్లు తమ విచారణలో తేలినట్లు డీఎస్పీ తెలిపారు. వారి నుంచి రూ.7.84లక్షల విలువైన ఐదు తులాల బంగారం, 119 తులాల వెండి ఆభరణాలు, రూ.45 వేల నగదు, స్కూటీ, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిందితులను పట్టుకున్న నకిరేకల్ సీఐ రాజశేఖర్, ఎస్‌ఐలు లచ్చిరెడ్డి, క్రిష్ణాచారి, పోలీస్ సిబ్బంది మధుకర్, వెంకటేశ్వర్లు, జనార్దన్, శ్రీకాంత్, శ్రీను, సురేష్, సుధాకర్, నాగర్జున, శ్రీనివాస్‌ను జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అభినందించి రివార్డులు ఇచ్చారని పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి, నకిరేకల్ ఎస్‌ఐలు లచ్చిరెడ్డి, క్రిష్ణాచారి పాల్గొన్నారు.

21న వలంటీర్ల ఎంపిక

నల్లగొండ టూటౌన్: కేంద్ర యువజన సర్వీసులు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో గుజరాత్‌లో జరిగే వెస్ట్ జోన్ ఎన్ఎస్ఎస్ ప్రీ రిపబ్లిక్ పరేడ్ క్యాంపునకు వెళ్లేందుకు గాను మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో అర్హులైన వలంటీర్లను ఈ నెల 21న ఎంపిక చేయనున్నట్లు ఎంజీయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పసుపుల మద్దిలేటి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పూర్తి వివరాలకు యూనివర్సిటీలోని ఎన్ఎస్ఎస్ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

అదుపుతప్పిన స్కూల్ బస్సు


రోడ్డు పక్కన గోతిలోకి జారిన బస్సు

మోత్కూరు: స్కూల్ బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కన గోతిలోకి జారింది. ఈ ఘటన మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని ఆరెగూడెం రహదారిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో మంగళవారం సాయంత్రం జరిగింది. వివరాలు.. మోత్కూరు మండల కేంద్రంలోని సెయింట్ ఆన్స్ పాఠశాలకు చెందిన బస్సు సుమారు 35 మంది విద్యార్థులతో ఆరెగూడెం మీదుగా పాలడుగుకు వెళ్తుండగా.. డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగం కారణంగా బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కన గోతిలోకి జారింది. భయాందోళనకు గురైన విద్యార్థులు ఎమర్జెన్సీ ద్వారం ద్వారా బస్సులో నుంచి కిందకు దిగారు. సమాచారం అందుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఘటనా స్థలానికి చేరుకొని తీవ్ర ఆందోళనకు గురయ్యారు. విద్యార్థులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

గురుకుల వ్యవస్థను ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది

- నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య


కట్టంగూర్ కేజీబీవీలో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య


కట్టంగూర్: రాష్ట్రంలో గురుకుల వ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మంగళవారం కట్టంగూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, జూనియర్ కళాశాలను ఆయన సందర్శించి మధ్యాహ్న భోజనం, మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాగునీరు, గదులకు కిటికీలు, టాయిలెట్స్‌కు తలుపులు, భోజన సదుపాయాలు సక్రమంగా లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. బడుగు, బలహీన వర్గాల విద్యార్థులను కాంగ్రెస్ ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గురుకులాల్లో సీట్ల కోసం పోటీ ఉండేదని, నేడు గురుకుల విద్య అంటేనే భయపడే పరిస్థితికి వచ్చిందన్నారు. ప్రభుత్వం మెనూ విస్తరించిందని గొప్పలు చెప్పుకుంటున్నా గురుకులాల్లో అమలుకావడం లేదన్నారు. భోజనంలో నాణ్యత లేక అనేక మంది విద్యార్థులు ఆస్పత్రుల పాలవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని అన్నారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ తరాల బలరాములు, పెద్ది బాలనర్సింహ, దాసరి సంజయ్, రెడ్డిపల్లి మనోహర్, పోతరాజు నాగేష్ ఉన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

కోదాదరూరల్: కుటుంబ కలహాలతో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కోదాడ పట్టణ పరిధిలోని గోల్డెన్‌సిటీ కాలనీలో సోమవారం రాత్రి జరిగింది. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోల్డెన్‌సిటీ కాలనీలో నివాసముంటున్న నూకల మహేష్(35) ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల భార్యాభర్తల తీవ్ర గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపం చెందిన మహేష్ సోమవారం రాత్రి ఇంట్లో తాను నిద్రించిన గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం 8 గంటల వరకు మహేష్ గది నుంచి బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన అతడి భార్య సమీపంలో ఉంటున్న బంధువులకు విషయం చెప్పింది. వారు వచ్చి తలుపులు పగులగొట్టి చూడగా.. మహేష్ ఫ్యాన్‌కు ఉరేసుకొని కనిపించాడు. మృతుడికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి సోదరుడు శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అత్యాచారానికి సహకరించిన తల్లికి 22ఏళ్ల జైలు శిక్ష

రామగిరి(నల్లగొండ): కన్న కూతురిపై అత్యాచారం జరగడానికి కారణమైన తల్లికి 22 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ నల్లగొండ పోక్సో కోర్టు జడ్జి రోజారమణి మంగళవారం తీర్పు వెలువరించారు. నల్లగొండ పట్టణంలోని లైన్‌వాడకు చెందిన గ్యారాల శివకుమార్ బీటీఎస్‌కు చెందిన వసంతపురి యాదమ్మతో వివాహేతర సంబంధం పెట్టుకొని, మైనర్ అయిన యాదమ్మ కూతురుపై కూడా కన్నేశాడు. యాదమ్మ సహకారంతో శివకుమార్ బాలికను అత్యాచారం చేయడానికి ప్రయత్నించగా తిరస్కరించింది. బలవంతంగా బాలిక దుస్తులు విప్పి వీడియోలు తీసి, శారీరకంగా అనుభవించాడు. శివకుమార్‌కు పెళ్లి అయి ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. బాధిత బాలిక 2023 మే 8న నల్లగొండ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో తల్లి యాదమ్మ, శివకుమార్‌పై ఫిర్యాదు చేసింది. పోలీసులు వారిద్దరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. పోక్సో కోర్టు జడ్జి రోజారమణి మంగళవారం తుది తీర్పు వెలువరిస్తూ.. ఇద్దరిని దోషులుగా ప్రకటించింది. ఏ1గా ఉన్న గ్యారాల శివకుమార్ ఉదయం కోర్టుకు వచ్చినట్లే వచ్చి పారిపోయాడు. అతడు కోర్టుకు గైర్హాజరైనట్లుగా న్యాయస్థానం ప్రకటించి దోషిగా తేలుస్తూ నాన్ బెయిలబుల్ వారెంట్ జారీచేసింది. తదుపరి కోర్టు ముందు హాజరుపర్చిన రోజు శిక్షను ఖరారు చేయడం జరుగుతుంది. ఏ2 యాదమ్మకు 22 ఏళ్ల జైలు శిక్ష, రూ.5000 జరిమానా విధించారు. బాధితురాలికి రూ.10 లక్షలు చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల రంజిత్‌కుమార్ వాదనలు వినిపించారు.



పదేళ్లు జైలు శిక్ష..

రామగిరి(నల్లగొండ), మర్రిగూడ: బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ నల్లగొండ పోక్సో కోర్టు జడ్జి రోజారమణి తీర్పు వెలువరించారు. మర్రిగూడ మండలం తిరుగండ్లపల్లికి చెందిన పోలె నరేష్ 2016 ఆగస్టు 22న అదే గ్రామానికి చెందిన బాలికపై అత్యాచారం చేశాడు. బాలిక విషయం తన తల్లికి చెప్పడంతో ఆమె మర్రిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్‌ఐ కె. బలరాం పోలె నరేష్‌పై పోక్సో కేసు నమోదు చేయగా.. అప్పటి నాంపల్లి సీఐ బాలగంగిరెడ్డి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసు తుది తీర్పులో భాగంగా జడ్జి రోజారమణి నిందితుడికి 10 ఏళ్ల జైలు శిక్ష, రూ.15,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. బాధితురాలికి రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

కారు డ్రైవర్‌కు..

కట్టంగూర్: ప్రమాదంలో కారుతో మహిళను ఢీకొని ఆమె మృతికి కారణమైన డ్రైవర్‌కు ఆరు నెలల జైలు శిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తూ నకిరేకల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ షేక్ ఆరిఫ్ మంగళవారం తీర్పు వెలువరించారు. కట్టంగూర్ ఎస్‌ఐ మునుగోటి రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. 2015 మార్చి 18న శాలిగౌరారం మండలం ఆకారం గ్రామానికి చెందిన బట్టా సుమన్ తన బంధువైన మందుల పరిమళను ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని స్వగ్రామం నుంచి అయిటిపాములలో శుభకార్యానికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో చెర్వుఅన్నారం క్రాస్‌రోడ్డు వద్ద రోడ్డు క్రాస్ చేస్తుండగా.. ఖమ్మం జిల్లా వేపకుంట గ్రామానికి చెందిన కారు డ్రైవర్ అంగోతు కిశోర్‌కుమార్ హైదరాబాద్ నుంచి విజయవాడకు కారులో అజాగ్రత్తగా, అతివేగంగా వెళ్తూ ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మందుల పరిమళ తలకు తీవ్రగాయాలై చికిత్స పొందుతూ మృతి చెందింది. సుమన్ తండ్రి వెంకన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌ఐ విజయ్‌ప్రకాశ్ కేసు నమోదు చేశారు. ఈ కేసు తుది తీర్పులో భాగంగా సాక్ష్యాధారాలను పరిశీలించిన జడ్జి నిందితుడికి ఆరు నెలల జైలుశిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారని ఎస్‌ఐ తెలిపారు.

అత్యాచారం కేసులో 20 ఏళ్లు..

రామగిరి(నల్లగొండ): మానసిక దివ్యాంగురాలైన బాలికపై అత్యాచారం చేసిన వ్యక్తికి 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ నల్లగొండ పోక్సో కోర్టు జడ్జి రోజారమణి తీర్పు వెలువరించారు. అడవిదేవులపల్లి మండల కేంద్రానికి చెందిన వీరంశెట్టి సాంబశివ 2017 ఏప్రిల్ 15న అదే గ్రామానికి చెందిన మానసిక దివ్యాంగురాలైన బాలికను ఇంట్లోకి ఎత్తుకెళ్లి అత్యాచారం చేశాడు. బాలిక తల్లి అడవిదేవులపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల రంజిత్‌కుమార్ వాదనలతో ఏకీభవించిన న్యాయమూర్తి రోజారమణి నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.25వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. బాధితురాలికి రూ.10లక్షల పరిహారం చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు. నిందితులకు శిక్ష పడేలా సరైన ఆధారాలు సేకరించడంలో అప్పటి ఇన్వెస్టిగేషన్ అధికారులుగా జె. రవీందర్, ఏ. రమేష్‌బాబు, జె. శివకుమార్ వ్యవహరించారు.